# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. హోలీ పండుగను పురస్కరించుకుని రాష్ట్రపతి సహా పలువురు ప్రముఖులు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.**

**2. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఈ రోజు, రేపు తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారు.**

**3. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రెండు రోజుల పర్యటనలో భాగంగా సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పం చేరుకున్నారు.**

**4. వచ్చే నెల 5వ తేదీ నుంచి రాష్ట్రంలో నిర్వహించనున్న ప్రచార షెడ్యూల్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి ఆ పార్టీ నేతలతో చర్చించారు.**

**5. ఈ ఏడాది జనవరిలో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో 16 లక్షల మంది చేరారని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.**

==========================

రంగుల పండుగ హోలీని ఈరోజు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో ఈ పండుగలో పాల్గొంటున్నారు.

హోలీ రంగులు దేశ వైవిధ్యానికి ప్రతీకలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. హోలీ ప్రజల ప్రేమ, ఐక్యత, సోదర భావాన్ని పెంపొందిస్తుందని, దేశ సాంస్కృతిక వారసత్వాన్ని బలోపేతం చేస్తుందని ఆమె తన సందేశంలో పేర్కొన్నారు. ఈ రంగుల పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాన్ని తీసుకురావాలని... కొత్త ఉత్సాహంతో దేశ నిర్మాణానికి కృషి చేయడానికి మనందరికీ శక్తినివ్వాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. ప్రధానమంత్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత నరేంద్రమోదీ కూడా హోలీ సందర్భంగా దేశ పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనురాగం, సామరస్యం అనే రంగులతో అలంకరించిన ఈ సంప్రదాయ పండుగ మీ జీవితాల్లో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని తీసుకురావాలని ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో హోలీ ఆనందం, శ్రేయస్సు, సామరస్యం, కొత్త శక్తిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

హోలీ పండుగ సందర్భంగా వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. 'మన జీవితాల్లో సంతోషాన్ని వికసించే వసంత రుతువుకు స్వాగతం పలుకుతూ.. రంగుల హోలీ అందరికీ ఆనందాన్ని పంచాలని కోరుకుంటున్నామని వారు తమ సందేశంలో పేర్కొన్నారు. 'చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీ అని సామాజిక మద్యమంలో ట్వీట్ చేశారు.

---------------------------

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనుంజయ వై.చంద్రచూడ్ ఈ రోజు, రేపు తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారు. ఈరోజు సాయంకాలం ఆయన తిరుపతి చేరుకుని అక్కడ నుంచి నేరుగా తిరుమల వెళ్లి రాత్రి అక్కడే బసచేస్తారు. రేపు ఉదయం శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో న్యాయవిభాగం ఆధ్వర్యంలో జరిగే న్యాయోత్సవ్-2024 వర్క్‌షాప్‌ను జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రారంభించి, ప్రసంగించనున్నారు. ఆ తర్వాత తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి ఢిల్లీ వెళ్ళనున్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో న్యాయోత్సవ్-2024 వర్క్ షాపునకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డీన్ వి.ఆర్.సి.క్రిష్ణయ్య ఆకాశవాణికి వివరించారు.

---------------------------

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రెండు రోజుల పర్యటనలో భాగంగా సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పం చేరుకున్నారు. కొద్దిసేపటి క్రితం బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో ఆయన కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలకు చేరుకున్నారు. అక్కడ్నుంచి కుప్పంలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి, నాయకులతో సమావేశమవుతారు. అనంతరం కుప్పం ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట జరిగే బహిరంగ సభలో పాల్గొని ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఏవీఆర్ కళ్యాణ మండపానికి చేరుకుని ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. రాత్రికి కుప్పంలోనే బసచేయనున్న చంద్రబాబునాయుడు రేపు కూడా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

---------------------------

వచ్చే నెల 5వ తేదీ నుంచి రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచారం ప్రారంభించనుంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రచారాన్ని ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ప్రచార షెడ్యూల్‌పై ఆమె పార్టీ ముఖ్య నాయకులతో విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈ రోజు సమావేశం నిర్వహించారు. కాగా.. నిన్న రాష్ట్రంలోని ఆరు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది.

---------------------------

ఈ ఏడాది జనవరిలో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ..ఈపీఎఫ్ఓలో 16 లక్షల మంది చేరారని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇందులో 8 లక్షల మంది కొత్తగా చేరారని.. కొత్తగా చేరిన సభ్యుల్లో 18 నుంచి 25 ఏళ్ల వారే 56.41 శాతం మంది ఉన్నారని, వీరిలో 2 లక్షల మంది మహిళలున్నారని పేర్కొంది. కాగా.. జనవరిలో దాదాపు 12 లక్షల 17 వేల మంది ఈపీఎఫ్ఓ నుంచి వైదొలిగి, మళ్లీ చేరారు. పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, తయారీ, మార్కెటింగ్ సేవలు, ఆసుపత్రుల్లో ఉద్యోగాల వృద్ధి అధికంగా ఉంది. 2018 ఏప్రిల్ నుంచి కొత్త చందాదారుల గణాంకాలను ఈపీఎఫ్ఓ విడుదల చేస్తోంది.

---------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తిరుపతిజిల్లా శ్రీకాళహస్తిలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో కేంద్ర సాయుధ బలగాలు ఈరోజు కవాతు నిర్వహించాయి. ఓటర్లను చైతన్యవంతులు చేయడానికి ఈ కవాతు నిర్వహించామని శ్రీకాళహస్తి డిఎస్పీ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు పాత్రికేయులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని చెబుతూ.....

**.....వాయిస్.... 25 సెకన్లు...**

---------------------------

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లాలో చెక్‌పోస్ట్‌ల వద్ద పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. పుట్టపర్తిలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దులో ఉన్న కొడికొండ చెక్‌పోస్టులో ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, నగలు, ఇతరత్రా సొత్తుపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకువెళ్లరాదని, పెద్ద మొత్తంలో నగదు, ఆభరణాలు ఉంటే తప్పనిసరిగా సంబంధిత పత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్పీ స్పష్టంచేశారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలోని ఓటర్ల కోసం పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేశారు. ఓటర్లు ఏదైనా సందేహాలు, ఫిర్యాదులు ఉంటే 18004258795, 18004258796, 18004258797 నెంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

---------------------------

తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండి క్యూ లైన్ వెలుపలకు వచ్చింది. శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. కాగా..శ్రీవారిని నిన్న 80 వేల 532 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ ఆదాయం 3 కోట్ల 95 లక్షల రూపాయలు లభించిందని తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు.. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా తిరుమలలోని తుంబురు తీర్థంకు విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పౌర్ణమి సందర్భంగా తిరుమలలో ఈరోజు రాత్రి శ్రీవారికి గరుడసేవ నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల మధ్య సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి గరుడ వాహనంపై తిరుమల వీధులలో విహరించి భక్తులకు దర్శనమిస్తారు.

---------------------------

విశాఖపట్నం నుంచి ఈ రోజు రాత్రి ఏడు గంటల పది నిమిషాలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం-తిరుపతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. రాత్రి ఏడు గంటల పది నిమిషాలకు బదులుగా పది గంటల పది నిమిషాలకు విశాఖపట్నం-తిరుపతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరుతుందని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు రైలు బయలుదేరే సమయంలో మార్పును గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

---------------------------

బంగాళాఖాతంలోని విశాఖ తీరంలో జరుగుతున్న ఎక్స్-టైగర్ ట్రయంఫ్-2024 సీ-ఫేజ్ విన్యాసాల్లో పాల్గొనేందుకు అమెరికా నౌకాదళానికి చెందిన యూఎస్ఎస్ హల్‌సే నౌక విశాఖపట్నం చేరుకుంది. అమెరికా నౌకాదళంలో క్షిపణి విధ్వంసకర నౌకగా గుర్తింపు పొందిన ఈ నౌకకు భారత నావికాదళ సిబ్బంది నిన్న సాదర స్వాగతం పలికారు.

======================